తీరనున్న వెతలు

- పీహెచ్‌సీ ప్రారంభం నేడు
- గ్రామస్తుల చెంతకే వైద్య సేవలు
- ఆనందంలో మండల వాసులు



కూనవరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆస్పత్రి

కూనవరం: ఏళ్ల నాటి కల సాకారమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూనవరం ప్రాంత వాసులకు కొన్నేళ్లుగా వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో నానా అవస్థలు పడ్డారు. వైద్యం కోసం సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చేది. అయితే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించడంతో వారి కష్టాలు తీరాయి. కూనవరంలో పీహెచ్‌సీ సేవలు అందుబాటులో రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూనవరం పాత ఆస్పత్రి ప్రాంగణంలోని భవనాల్లో తాత్కాలికంగా ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతులమీదుగా గురువారం మధ్యాహ్నం 2.00 గంటలకు నూతన ఆస్పత్రిని ప్రారంభిస్తారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఇక్కడి ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా దాన్ని జగ్గవరం పంచాయతీలోని కోతులగుట్టకు తరలించారు. అప్పటి నుంచి మండల కేంద్రంలో ప్రాథమిక వైద్యం అందుబాటులో లేకపోవడంతో కూనవరం, టేకులబోరు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాత్రిళ్లు ప్రాథమిక వైద్యం కోసం కోతులగుట్ట వెళ్లేందుకు వాహనాలు అందుబాటులో లేక నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం స్పందించి కూనవరంలో పీహెచ్‌సీ మంజూరు చేయడంతో గ్రామస్తులకు వైద్య సేవలు చేరువయ్యాయి...కష్టాలు తీరాయి.

ఎన్నికల హామీ.. నెరవేరిందిలా

2019 ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్సీ అప్పటి రంపచోడవరం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అనంత ఉదయ్ భాస్కర్ కూనవరం పర్యటనలో భాగంగా స్థానికులు పీహెచ్‌సీ సమస్యను వివరించారు. వందేళ్లకు పూర్వం నుంచి ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్న ఆస్పత్రిని తరలించడం బాధాకరంగా ఉందని తప్పనిసరిగా కొత్తగా ఆస్పత్రిని మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేగా నాగులపల్లి ధనలక్ష్మి భారీ మెజార్టీతో గెలిపిస్తే తప్పకుండా ఆస్పత్రి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం భారీ మెజార్టీతో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి గెలుపొందడం, ఆ తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఆస్పత్రి ఏర్పాటును ప్రస్తావించడం జరిగింది. దీనిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి వెంటనే పీహెచ్‌సీ మంజూరుకు చర్యలు తీసుకున్నారు. వైద్య సేవలు అందుబాటులో రావడంతో కూనవరం, టేకులబోరు తదితర ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

వెంకటరమణ సేవలు మరువలేనివి



వెంకటరమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వీఆర్ పురం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మామిడి వెంకటరమణ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రేఖపల్లిలో వెంకటరమణ సంస్మరణ సభ బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ పార్టీకి వెంకటరమణ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల గంగులు, పార్టీ రాష్ట్ర నాయకుడు ముత్యాల మురళి, మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, ఎంపీటీసీ సభ్యురాలు బంధం విజయలక్ష్మి, సర్పంచ్‌లు పిట్టా రామారావు, వద్దానపు శారద, సోడె నరసమ్మ, శ్రీరామగిరి ఆలయ చైర్మన్ రేవు బాలరాజు, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, వెంకటరమణ సోదరుడు మామిడి రాజు, కుమారుడు బాలాజీ, నాయకులు కాంతారావు, వెంగళరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



పాడి రైతులతో మాట్లాడుతున్న పశువైద్యాధికారి చరణ్

హుకుంపేట: మండలంలోని తడిగి పంచాయతీ కేంద్రంలో పశు వైద్యాధికారి డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం గ్రామ సచివాలయ కేంద్రంలో పశు విజ్ఞాన బడి సమావేశం నిర్వహించారు. పాడి రైతులకు పశువ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గమనిస్తే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. అంతే కాకుండా పశువులను శాస్త్రీయ పద్ధతిలో పెంపకతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు.సర్పంచ్ పెనుమల రమేష్, సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న ఎంపీపీ ఈశ్వరి

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ బాక ఈశ్వరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చన్నారు. యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఏటా ఇటుకల పండగ సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సొవ్వ పంచాయతీలో ఎంపీపీ ఆర్థికసాయంతో నిర్వహించిన పోటీల్లో మొదటి విజేతకు రూ.10వేలు, రెండో విజేతకు రూ.5వేలు ప్రోత్సాహం అందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి గోపాల్, ఉప సర్పంచ్ జగ్గనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సింగ్, సింహాచలం,అశోక్‌కుమార్, వినోద్ , గణపతి, తిరుపతి, రాంప్రసాద్, రామారావు, ఎండీయూ జిల్లా అధ్యక్షుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రైతు భరోసా

గూడెంకొత్తవీధి: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం ద్వారా రైతు భరోసాను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని గూడెంకొత్తవీధి మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ ప్రస్తుతం2023 సంవత్సరానికి సంబంధించి కొత్తగా రైతు భరోసా పథకం కోసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్ ఆధార్‌కార్డు, ఫోన్‌నంబరు బ్యాంకు ఖాతా జెరాక్స్‌లతో సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. గత ఏడాది లబ్ధిపొందిన రైతులు ఇప్పుడు మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనచోదకులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ రమణ

చింతపల్లి: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చింతపల్లి ఎస్‌ఐ రమణ అన్నారు. సంతబయలు వద్ద ఆటో, ద్విచక్ర వాహన డ్రైవర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మితిమీరిన వేగంతో వెళ్లే వాహనచోదకులపై చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విస్తృతంగా ఉపాధి పనులు



పనుల నిర్వహణపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: గ్రామాల్లో విస్తృతంగా ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో కె.బాపన్నదొర అన్నారు. ఉపాధి హామీ ఏపీవో దాసరి మణికుమారితో కలిసి బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ ఉపాధి కూలీల రిపోర్ట్‌ని ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలన్నారు. ఉద్యానవన మొక్కలు పెంపకానికి 2023-2024 సంవత్సరానికి లబ్ధిదారుల గుర్తింపు చేపట్టాలన్నారు. ఆధార్‌కార్డులు సీడింగ్ చేయించాలన్నారు. నిర్ధారించుకున్న పనుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కొలతల ప్రకారం కూలీలకు వేతనాలు రోజుకి రూ.272 వచ్చేలా కొలతలు ఇవ్వాలన్నారు. టీఏలు, ఎఫ్ఎలు ఈ అంశంపై శ్రద్ధ వహించాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి వేతనదారుడుకి 2023 ఏప్రిల్ మాసం నుంచి 100 రోజులు పని కల్పించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులకు తెలియపరిచి ఉపాధి హామీలో కొత్త పనులు మొదలు పెట్టించాలన్నారు. పంచాయతీల్లో చేపట్టిన పనుల వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు.

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ నేడు

వీఆర్ పురం: మండల కేంద్రంలోని రేఖపల్లిలోని వెలుగు కార్యాలయంలో గురువారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు అడ్డతీగల సొసైటీ చైర్మెన్ తోట రాజేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరైన చెక్కుల పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు మండలంలోని సచివాలయాల కన్వీనర్లతో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన తెలిపారు.

బొండా నియామకంపై హర్షం



అప్పలరాజును సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

పెదబయలు: వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదల్ అధ్యక్షుడిగా పెదబయలు మండలానికి చెందిన బొండా అప్పలరాజు ఎన్నికై నట్టు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అప్పలరాజుకు అరకు ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీకి సేవలందించిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందరావు, వైస్ ఎంపీపీ రాజుబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, నాయకులు సూర్యనారాయణ, గంగాభవాని, కనకరాజు, సూరయ్య, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

మాడుగుల రూరల్ : ఇంటింటా పెరటి తోటల పెంపకంపై ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో చింతలూరులో బుధవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న జిల్లా ఆదనపు డీపీఎం ఆర్.వి. స్వామినాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటి దగ్గర ఏడాదంతా కిచెన్ గార్డెన్లు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వనరులతో తయారు చేసిన కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి, కూరగాయలు, ఇతర పంటల్ని పండించుకుని, తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్థానికులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ కాళింగ శకుంతల, మాజీ సర్పంచ్ కాళింగ కళ్యాణరాజు, మండల ట్రైనర్ రాము, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



శాశ్వత భూ హక్కు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి

రాజవొమ్మంగి: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాల్లో భాగంగా బుధవారం దూసరపాము గ్రామంలో బుధవారం సర్పంచ్ చీడి శివ అధ్యక్షతన రైతులతో మూడవ దఫా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సర్వే నెంబర్‌కు గల ప్రతి పట్టా భూమికి కొలతలు తీసి ప్రభుత్వం శాశ్వత భూమి హక్కు పత్రాలు అందజేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భూమి సరహద్దుల్లో సర్వే రాళ్లు వేయనున్నట్టు చెప్పారు. ఉప సర్పంచ్ సత్యనారాయణ, పంచాయతీ ఇన్‌చార్జ్ ముసలయ్య, రాంబాబు, వీరబాబు, వీఆర్వో సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ మహేష్, సిబ్బంది

అరకులోయ రూరల్: రైల్వే లైన్లలో ప్రమాదాలపై ఆర్‌పీఎఫ్ సీఐ మహేష్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని రైల్వే లైన్‌కు ఆనుకుని ఉన్న అరకులోయ పట్టణం, యండపల్లివలస, గోరాపూర్, కిల్లోగూడ, శాంతినగర్, శరత్‌నగర్ గ్రామల్లో ప్రమాదాలపై రెండో రోజు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ట్రాక్‌లపై గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెటుకుని విస్తృతంగా ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్యం కల్పిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఎస్ఐలు మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం



లక్ష్మణ్

గూడెంకొత్తవీధి: ఈనెల 7వ తేదీ నుంచి చేపట్టనున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ విభాగ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ కోరారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామ, వార్డు వలంటీర్లు, గృహ సారథులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పరంగా చేకూరిన ప్రయోజనాలనే ప్రధాన ఎజెండాగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లే బృహత్తర కార్యక్రమమే జగనన్నే మాభవిష్యత్ అన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లోనూ ప్రతి ఇంటికీ వెళ్లి చేపట్టేలా రూపొందించినట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇందులో భాగస్వాములు కావాలని లక్ష్మణ్ కోరారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి



రంపచోడవరంలో వేడుకలో సర్పంచ్ బొజ్జయ్య తదితరులు



ఇందుకూరుపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



రాజవొమ్మంగిలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ సభ్యులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీసీసీ కార్యదర్శి సత్తిబాబు తదితరులు

చింతూరు: స్వాతంత్ర్య సమరయోధులు, ఉప ప్రధాని బాబు జగ్జీవన్ జయంతిని బుధవారం జిల్లాలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చేసిన సేవలను గుర్తు చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతూరులో జరిగిన కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాదీపం, దళిత జన బాంధవుడు బాబు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. భారత ఉప ప్రధానిగా ఆయన అందించిన సేవలు మరువలేమన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమ సమాజ స్థాపనకు కృషి చేసిన కృషీ వలుడు జగ్జీవన్ రామ్ అన్నారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, సొసైటీ చైర్మన్ శ్యామల విజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండల కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రమేష్, నారాయణ రెడ్డి, ప్రకాష్, సచివాలయం సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. ఇర్లపల్లిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సుభాకర్‌రావు, అధ్యాపకులు టి.కన్నపరాజు, ఎం.వెంకటేశ్వరరావు, చైతన్య, పీడీ రాజన్నదొర తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేటలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జగజ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగేశ్వరరావు, చంటి, దాసు,వీర్రాజు , చిన్ని, సురేష్ ,రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండల కేంద్రంలో ఏపీసీసీ కార్యదర్శి దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో గాంధీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల్పంచారు.

గంగవరం : జగ్జీవన్‌రామ్ జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం వివిధ గ్రామాల్లో ఆయనకు నివాళులర్పించారు. సర్పంచ్ అక్కమ్మ, వైస్ ఎంపీపీ గంగాదేవి, ఆదివాసీ జేఏసీ నాయకులు కుంజం సిద్దు, రాంబాబు తదితరులు బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాలర్పించారు.

రాజవొమ్మంగి: మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. 0

సమస్యల పరిష్కారానికి కృషి

చింతూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మిను ఆదివాసీ, జేఏసీ నాయకులు కలిసి పలు సమస్యలను వివరించారు. ఇందులో భాగంగా గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి సమస్యను యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం

బుచ్చెయ్యపేట : పల్లెల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసతా సేవా ఫౌండేషన్ కమిటీ సభ్యులు పూడి రామారావు, ముచ్చకర్ల నాగేశ్వరరావులు సూచించారు. బుధవారం బుచ్చెయ్యపేట రామాలయంలో అన్ని గ్రామాల సమరసతా సభ్యుల సమావేశం జరిగింది. ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు విచ్ఛిన్నమై, భక్తిభావం తగ్గుతోందన్నారు. అన్ని గ్రామాల దేవాలయాల్లో ఉదయం, సాయంత్రం భజనలు, ప్రార్థనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ప్రశాంత జీవనం పొందవచ్చన్నారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

మాకవరపాలెం : మండలంలోని పెద్దిపాలెం, చామంతిపురం, పాపయ్యపాలెం గ్రామాల్లో పరదేశమ్మ పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు.
ఉదయం నుంచే అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగించి, అనంతరం ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

9న హనుమాన్ శోభాయాత్ర

అనకాపల్లిటౌన్: పట్టణంలో ఈ నెల 9న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూ బంధువుల శోభాయాత్ర కమిటీ సభ్యుడు, హిమశేఖర్ విద్యాసంస్థల అధినేత కొణతాల జనార్ధన్ తెలిపారు. సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ స్వామి దేవాలయం నుంచి మండలంలో కొత్తూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి హనుమాన్ దేవాలయం వరకు యాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని, కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని తెలియజేశారు.

క్లుప్తంగా

మోసపూరిత యాప్‌లపై అవగాహన



ఆన్‌లైన్ రుణ యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ షరీఫ్

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామంలో చికిలింతలో ఎస్‌ఐ షరీఫ్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ రుణ యాప్‌ల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకొవద్దన్నారు. మోసాలకు పాల్పడిన వారు తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

నేడు చినార్కూర్‌లో 'గడప గడపకు'

కూనవరం: మండలంలోని చినార్కూరు పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2.00 గంటలకు కూనవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని, 3.00 గంటలకు చినార్కూరు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెసీఎస్ మండల ఇన్‌చార్జి, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరుకావాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

రంపచోడవరం: మండల కేంద్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ కార్మికుల సంక్షేమ సమగ్ర సర్వే యాత్ర-2 బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు వృత్తి సంబంధించి పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీపై రుణ సదుపాయం కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.సంఘం ప్రతినిధులు వై.పోసిబాబు, ఎస్.ప్రసాద్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతి బోరుకు మరమ్మతులు



బోరును బాగు చేస్తున్న మెకానిక్

కూనవరం: చినార్కూరు పంచాయతీ తెల్లవారిగుంపు గ్రామంలో చేతి బోరు పాడవడంతో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
ఈ విషయం తెలుసుకున్న చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్ బోరు మరమ్మతు పనులు చేయించేందుకు ముందుకొచ్చారు. మెకానిక్ ద్వారా బోరు బాగు చేయించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధుల దూరం

అనకాపల్లి టౌన్: తులసి, తిప్పతీగ, వేప, పసుపు, నేలనేము, నేల ఉసిరి, సొంటి, మిరియాలు, ధనియాలు, జీలకర్ర నిత్య జీవితంలో ఉపయోగించడం వల్ల పలు వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు కె.వి.గౌరీపతి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కరోనా తరువాత ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన పెరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆయుర్వేదంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అశ్వగంధ, త్రిఫలచూర్ణం, చవనప్రాస, అగస్త్య హరిత చూర్ణం వంటి వాటిపై ఆమె అవగాహన కల్పించారు.